# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాగ్ రాజ్‌లో వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే మహాకుంభ్-2025 ను ఈ రోజు లాంఛనంగా ప్రారంభిస్తారు.**
2. **'ఒక దేశం ఒక ఎన్నికల' బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
3. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ఈ రోజు విజయవాడలో విడుదల చేస్తారు.**
4. **ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పలువురు కేంద్రమంత్రులతో సమావేశమయ్యారు.**
5. **తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌ని సందర్శించి వచ్చే ఏడాది జనవరి 13 నుంచి అధికారికంగా ప్రారంభమయ్యే మహాకుంభ్-2025 ను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ప్రయాగ్ రాజ్ లో మౌలిక సదుపాయాలు, మెరుగైన రవాణా వ్యవస్థ కోసం దాదాపు 7 వేల కోట్ల రూపాయలతో మహాకుంభ్ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారు. వీటిలో 10 కొత్త వంతెనలు, పైవంతెనలు, శాశ్వత ఘాట్లు, రివర్ ఫ్రంట్ రోడ్లు వంటి వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం కుంభమేళా ప్రాంతంలో జరిగే ర్యాలీలో నరేంద్రమోదీ ప్రసంగిస్తారు.

--------------------------

'ఒక దేశం ఒక ఎన్నికల' బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఈ బిల్లుని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలపై పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను సెప్టెంబర్ 18న కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ఈరోజు

విజయవాడలో విడుదల చేస్తారు. రానున్న రెండు దశాబ్దాల కాలంలో రాష్ట్రంలో వివిధ రంగాలకు సంబంధించిన ప్రగతి ప్రణాళికలను స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ ద్వారా వెల్లడించనున్నారు. స్థానిక ఇందిరా గాంధీ నగరపాలక సంస్థ క్రీడా మైదానంలో ఈ ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతీ జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, విజయవాడ నగరంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. మహాత్మాగాంధీ రహదారిపై బస్సులు, ఆటోలకు అనుమతి లేదని వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమానికి వచ్చే వాహనాలకు మాత్రమే ఆ మార్గంలో అనుమతిస్తామని చెప్పారు.

---------------------------

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు దిశా నిర్దేశం జరగనుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో డాక్యుమెంట్ ఆవిష్కరణ ఏర్పాట్లను మంత్రి గత రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని అన్నారు. విజన్ డాక్యుమెంట్ ద్వారా వివిధ విధానాలకు రూపకల్పన చేసి అమలు చేయనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన ఒంటరి చిన్నారులకూ పింఛన్లు అందించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సు ముగింపు సమావేశంలో నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కలెక్టర్లు, అధికారులు పనిచేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ

...వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి నిన్న ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశమైయ్యారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేమై పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యమైన రహదారులు, మెట్రో రైలు ప్రాజెక్టు, సింగరేణికి బొగ్గు గనులు, కేంద్రీయ విద్యాలయాల కేటాయింపుల గురించి ముఖ్యమంత్రి కేంద్రమంత్రులకు వివరించారు.ప్రాంతీయ బాహ్యవలయ రహదారి-ఆర్ఆర్ఆర్, హైదరాబాద్ మెట్రో రెండో దశతో పాటు హైదరాబాద్, వరంగల్‌లలో భూగర్భ డ్రైనేజీ ప్రణాళికలు, సింగరేణికి బొగ్గు గనుల కేటాయింపు అంశాలపై వారతో చర్చించారు.

---------------------------

అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని తిరుమల, సూళ్లూరుపేట ప్రాంతాల్లో భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులకు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా హెచ్చరికలు పంపి అప్రమత్తం చేయాలని విపత్తు నిర్వహణ శాఖను హోంమంత్రి ఆదేశించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కలెక్టర్లు చర్యలు తీసుకుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సు భాగంగా మానవవనరుల శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పదవతరగతి ఫలితాల్లో వంద రోజుల ప్రణాళికపై దృష్టిసారించాలన్నారు. వసతిగృహాల్లో పారిశుద్ధ్యం, భోజన నాణ్యతపై పర్యవేక్షణ అవసరమని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

--------------------------

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన మాట్లాడుతూ, లేబర్ ఎంప్లాయిమెంట్ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఛైర్మన్‌గా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య సభ్యులుగా త్రిసభ్య కమిటీ పనిచేయనుందని చెప్పారు. ఆర్టీసీలో విధుల్లో ఉన్న ఉద్యోగులపై నమోదైన సర్వీస్ రిమూవల్ కేసులని ఈ కమిటీ పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు.

--------------------------

సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చెన్నైకి చెందిన దొమ్మరాజు గుకేష్ విజేతగా నిలిచారు. చివరి రౌండ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ లిరెన్‌పై విజయం సాధించి అత్యంత చిన్న వయస్సు చెస్ ప్రపంచ ఛాంపియన్‌గా రికార్డు సృష్టించారు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత చెస్ ఛాంపియన్‌షిప్ సాధించిన రెండో భారతీయుడిగా గుకేష్ నిలిచారు.

గుకేష్ విజయంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నరు జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

--------------------------

జాతీయ అశ్వ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. గుర్రాలు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేసేందుకు 2004వ సంవత్సరం నుండి ప్రతీఏటా డిసెంబర్ 13వ తేదీన జాతీయ అశ్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఒక దేశ ఆర్థిక, చారిత్రక, సాంస్కృతిక రంగాలలో.. అశ్వాలు పోషిస్తున్న పాత్రను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమం జరుగుతోంది. చారిత్రకంగా కూడా మానవ జీవన స్రవంతిలో గుర్రాలు కీలక భూమిక పోషిస్తున్నాయి.

=====================